ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

ఆదివారం 10 ఆగస్టు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	:9985445760
ధర్మవరం, పుట్టపర్తి	: 9963160529
కదిరి	:9052518170

ఏసీఎమ్: 9985411154



అలరించిన నాటిక

పుట్టపర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు దివ్యప్రణాళిక పేరిట ప్రదర్శించిన నాటిక భక్తులను అలరింపజేసింది. తెలంగాణ భక్తులు పర్తియాత్రగా శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో క్రితజనత సంబరాల పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు.. వానరులకు రామునిపై ఉన్న భక్తి, లవకుశల జీవిత చరిత్ర, మార్కండేయ పురాణంలోని ఘట్టాలను ప్రదర్శించారు. పంచసూక్తుల పేరుతో భక్తిగీతాలను ఆలపించారు. వేడుకల్లో 2,500 మంది బాలవికాస్ చిన్నారులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

← మార్కండేయ పురాణంలోని ఘట్టం

ముస్తాబవుతున్న గణపయ్యలు

- తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు
- ముందస్తు బుకింగ్ చేసుకుంటున్న భక్తులు

7

కొనుగోలు చేయడానికి విగ్రహాలను పరిశీలిస్తున్న ప్రజలు



ఆదివాసీల జీవన విధానం.. ఆదర్శం

- జేసీ అభిషేక్ కుమార్
- గోరంట్లలో ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్



నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థినులు

గోరంట్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ప్రకృతితో మమేకమై ఉంటారనీ, వారి జీవన విధానం సమాజానికి ఆదర్శమని జేసీ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ.. ఆదివాసీల వారసత్వ భాష, నృత్యం, సంప్రదాయాలు, వ్యవసాయ పద్ధతులను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంగ్లేయులను వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తొలివీరులు గిరిజనులు అని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజన పిల్లలు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలోని కదిరి, పెనుకొండ, గోరంట్లతోపాటు, ఐదు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు సమకూర్చాల్సి ఉందని తెలిపారు. గురుకులాల్లో గిరిజన భాష, వస్త్రధారణను కాపాడడానికి ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అనంతరం గిరిజన విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, జిల్లా సంక్షేమ శాఖాధికారి మోహన్‌రావు, ప్రిన్సిపాల్ తులసీబాయి, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ ఉచ్చు..!

- కదిరిలో డైలీ ఫైనాన్స్ పేరుతో దందా
- వడ్డీలు కట్టలేక చిరువ్యాపారుల తంటాలు
- అప్పులు తీర్చలేక వలస వెళ్తున్న కొందరు
- లాటరీ టిక్కెట్లతో గుల్లవుతున్న కుటుంబాలు



పట్టణంలో జిరాక్స్ పేపర్‌లో విక్రయిస్తున్న లాటరీ టిక్కెట్లు



కదిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వడ్డీ వ్యాపారులు జలగళ్లా ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారు. డైలీ ఫైనాన్స్ పేరుతో వడ్డీకి వడ్డీ, ఒక రోజు కట్టకపోతే జరిమానా, తదితర పేర్లతో రుణగ్రహీతలను నంజుకుతింటున్నారు. ఈక్రమంలో తాము సంపాదించిన సొమ్మంతా వడ్డీకే సరిపోతోందని, ఇక అసలు ఎప్పుడు చెల్లించాలని అవసరార్థం అప్పు తీసుకున్న చిరు వ్యాపారులు, కూలీలు వాపోతున్నారు. కొన్నిసార్లు వేధింపులు తాళలేక వడ్డీ కట్టడానికే కొత్త అప్పు చేయాల్సి వస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో లాటరీ టిక్కెట్ల విక్రయం కూడా బాగా పెరిగింది. చిరు వ్యాపారులు, కూలీలు, ఇతర వర్గాలు వారు ఆశతో అప్పులు చేసి మరీ వీటిని కొని నష్టపోతున్నారు. ఈక్రమంలోనే రుణదాతల ఒత్తిళ్ల తాళలేక కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారు.

డైలీ ఫైనాన్స్ పేరుతో దందా

డైలీ ఫైనాన్స్ పేరుతో పట్టణంలో వడ్డీ దందా సాగుతోంది. చిరు వ్యాపారులు ముఖ్యంగా చికెన్ పకోడా, పండ్లు, కూరగాయల వ్యాపారం చేసుకునేవారు డైలీ ఫైనాన్స్ తీసుకుంటున్నారు. ఉదాహరణకు రూ.పదివేలు అప్పు తీసుకుంటే, వ్యాపారి వారికిచ్చేటప్పుడే రూ.12వందలు పట్టుకుని రూ.8,800లు ఇస్తున్నారు. అది రోజుకు రూ. వంద చొప్పున వందరోజుల్లో తీర్చాల్సి ఉంటుంది. ఒక రోజు కట్టకపోతే మరుసటి రోజు రెండు రోజుల డబ్బు తీసుకుంటారు. ఇలా వంద రోజుల్లో రూ. పది వేలు కట్టించుకుంటారు. అంటే అప్పు ఇచ్చేటప్పుడు పట్టుకున్న రూ.1200లతో కలిపి మొత్తం రూ.2,400 వడ్డీ వసూలు చేస్తారు. ఒకరోజు కట్టకపోయినా జరిమానా వేసి మరీ వసూలు చేస్తుంటారు. ఆ జరిమానా డబ్బు కంతులోకి జమకాదు. ఈ డైలీ ఫైనాన్స్ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో చాలా మంది దీన్ని వృత్తిగా మార్చుకుంటున్నారు.

వడ్డీకి వడ్డీ కట్టలేమంటున్న చిరు వ్యాపారులు

రోజు, వారం, నెల ఫైనాన్స్ ఇచ్చేవారు రోజు వారీ కంతుల(వాయిదా) ప్రకారం వసూలు చేస్తారు. ఆ కంతులు కట్టలేకపోతే దానికి జరిమానా ఉంటుంది. వందరోజులైనా ఆ అప్పు తీరకపోతే అదనంగా జరిమానా కలిపి అప్పు తీరేంతవరకు వసూలు చేస్తారు. వందరోజులోపు రూ. పదివేలు అప్పు తీర్చలేకపోతే, మిగిలిన డబ్బుకు మరో రూ.పదివేలు అప్పు ఇస్తారు. అందులో రూ.1200లతోపాటు, పాత అప్పు ఎంత కట్టాలో ఆ మొత్తాన్ని మినహాయించుకుని అప్పు ఇస్తారు. ఇలా వడ్డీకి వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. దీంతో అప్పు తీసుకున్నవారు వడ్డీలు కట్టలేక నానా అగచాట్లు పడుతున్నారు.

లాటరీ ఆశతో...

అప్పులు, వడ్డీలతోనే సతమతమవుతున్న చిరువ్యాపారులు ఇప్పుడు కొత్తగా వచ్చిన లాటరీ టిక్కెట్ల కొనుగోలు వైపు ఆకర్షితులవుతున్నారు. తక్కువ మొత్తానికే ఎక్కువ డబ్బు వస్తుందన్న ఆశతో అప్పు చేసి మరీ టిక్కెట్లు కొంటున్నారు. మదనపల్లి కేంద్రంగా కదిరికి లాటరీ టిక్కెట్లు సరఫరా చేస్తున్నారు. నిజావంలీకాలనీ, చౌక్ సర్కిల్‌లో ఇద్దరు ఈలాటరీ టిక్కెట్ల దందాను నడుపుతున్నట్లు సమాచారం. పట్టణంలోని శివారు ప్రాంతాలు, మురికివాడలను ఎంచుకుని లాటరీ టిక్కెట్ల వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. 20మంది దాకా ఈలాటరీ టిక్కెట్లను జిరాక్స్ పేపర్లలో అమ్ముతున్నట్లు సమాచారం. నల్లనీరం,-100, ధనశ్రీ వంటి పేర్లతో నెంబర్లు వేసి లాటరీ టిక్కెట్లు అమ్ముతున్నారు. రూ.వంద, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఎనిమిది వందలు, వెయ్యి ఖరీదుతో టిక్కెట్లు అమ్ముతున్నారు. ఉదయం అమ్మిన టిక్కెట్లకు సాయంత్రమే ఫలితాలు ప్రకటిస్తున్నారు. ఈక్రమంలో ఆశతో నిత్యం అనేకమంది వేలాది రూపాయలు వెచ్చించి లాటరీ టిక్కెట్లు కొని నష్టపోతున్నారు. ఇంట్లో చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఅప్పులు తీర్చడానికి ఫైనాన్స్ వ్యాపారులను ఆశ్రయిస్తూ, మరో ఉచ్చులో ఇరుక్కుంటున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



పట్టణంలో డైలీ ఫైనాన్స్ పేరుతో ఎవరైనా అధిక వడ్డీలు వసూలు చేస్తున్నట్లు బాధితులు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామని, కేసు నమోదు చేస్తాం. లాటరీ టిక్కెట్ల విషయం విచారించి, ఎవరు నెట్‌వర్క్ నడుపుతున్నారో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

\- శివనారాయణస్వామి,డీఎస్పీ

ముంచిన వాన



ధర్మవరంలో భారీ వర్షం

మగ్గం గుంతల్లోకి చేరిన వర్షపు నీరు

తెల్లవార్లు జాగరణ చేసిన నేతన్నలు

వర్షాకాలపు భృతి ఇవ్వాలంటున్న చేనేత కార్మికులు

ధర్మవరం ఇందిరమ్మ కాలనీలో ఇంట్లో వాన నీటిని ఎత్తిపోస్తున్న మహిళ

(వివరాలు 7వ పేజీలో...)





స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

ఖాద్రీశుడి ఆలయం కిటకిట

కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో భక్తులు.. స్వామివారి దర్శనానికి బారులు తీరారు. శుక్రవారం రాత్రి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని క్యూలో గంటల కొద్దీ వేచి ఉన్నారు. కర్ణాటక నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - ఆంధ్రజ్యోతి, కదిరి

కలప తరలిస్తున్నా.. కళ్లు మూసుకున్నారు..

- పగలే రవాణా
- సామిల్లు, టింబర్ డిపోలకు తరలింపు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

కొత్తచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పొలాల గట్లపై ఉన్న వేప, తుమ్మ తదితర చెట్లను కొంతమంది వ్యాపారులు కొట్టి కొత్తచెరువు, గోరంట్ల, ధర్మవరం ప్రాంతాల్లోని సామిల్లులకు ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన అటవీ అధికారులు.. మామూళ్లు పుచ్చుకుని మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుక్కపట్నం మండలం బిట్రకుంటపల్లి వద్ద వేప, తుమ్మ, టేకు తదితర చెట్లను కొందరు వ్యాపారులు కొట్టివేసి ట్రాక్టర్లలో కొత్తచెరువు, ముదిగుబ్బకు తరలిస్తున్నారు. అటవీ ప్రాంత సమీపంలోని చెట్లను సైతం కొందరు నరికేసి, ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అటవీశాఖ అధికారులు, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని అటవీ ప్రాంత సమీప గ్రామ ప్రజలు వాపోతున్నారు. కొత్తచెరువులోని సామిల్లుకు రోజూ 10 నుంచి 20 ట్రాక్టర్లలో కలపను వ్యాపారులు పగటిపూటే తరలిస్తున్నా.. అటవీ అధికారులు మౌనం వహిస్తుండడం శోచనీయం. సామిల్లు, టింబర్ డిపోల్లో భారీగానే కలపను డంపింగ్ చేసి యథేచ్ఛగా అమ్ముతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

తనిఖీలు శూన్యం

జిల్లాలోని సామిల్లులపై అటవీశాఖ అధికారుల తనిఖీలు కరువయ్యాయి. దీంతో వ్యాపారులు పచ్చని చెట్లను యథేచ్ఛగా నరికి సామిల్లుకు తరలిస్తున్నారు. ఇదంతా పగలే, జిల్లా అటవీ అధికారి కార్యాలయం సమీపంలోనే సాగుతున్నా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సామిల్లులు, టింబర్ డిపోలపై అటవీ అధికారుల తనిఖీలు లేకపోవడంతో కలప అక్రమ రవాణా జిల్లాలో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.



బుక్కపట్నం మండలం బిట్రకుంటపల్లి వద్ద కలపను తరలిస్తున్న దృశ్యం

నిఘా పెడతాం

పచ్చని చెట్లను కొట్టివేస్తే కేసులు నమోదు చేస్తాం. కలపను అక్రమంగా రవాణా చేస్తుంటే ఫొటోలు తీసి, 9440810065 నంబరుకు సమాచారం అందించాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

\- చక్రపాణి, జిల్లా అటవీ అధికారి

వైసీపీ పాపాలు..!

అహుడా పరిధిలో కుప్పలు తెప్పలుగా అనధికార లే అవుట్లు

- 700కిపైగా అనుమతులు లేనివే..
- అధిక భాగం వైసీపీ హయాంలో వేసినవే..
- క్రమబద్ధీకరణకు ససేమిరా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



అనధికార లే అవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న అహుడా అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో భూఅక్రమాలకు అంతేలేదన్నది బహిరంగ రహస్యమే. భూకబ్జాలతో పేట్రేగిపోయారు. ఆ పార్టీకి చెందిన నేతలు.. రియల్టర్ల అవతారమెత్తి నిబంధనలకు తిలోదకాలిచ్చారు. యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేసి, అడ్డంగా దోచుకున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారు. కూటమి ప్రభుత్వం లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తేవడంతో అక్రమాలు బయటపడుతున్నాయి. 2019-24 మధ్య వైసీపీ పాలనలో అనంతపురం హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో 700కిపైగా లేఅవుట్లు 8వేల ఎకరాల్లో విస్తరించినట్లు సమాచారం. వీటిలో 80శాతానికిపైగా వైసీపీ నేతలకు చెందినవే కావడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలోనే విజిలెన్స్ అధికారులు.. అనధికార లేఅవుట్లపై నివేదిక ఇచ్చినా బుట్టదాఖలు చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం అనధికార లేఅవుట్లను కట్టడి చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వెంచర్లను క్రమబద్ధీకరించే పనిలో పడింది. ఈ ప్రక్రియలో అసలు విషయం బయటకు వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అహుడాలోనే పనిచేస్తున్న ఓ ఇంజనీరు.. వైసీపీ నేతలతో అంటకాగినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ ఇంజనీరును అహుడాలోనే కొనసాగిస్తుండడం గమనార్హం. ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో 700కిపైగా ఉన్న అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్న (మిగతా 6వ పేజీలో..)

వేతనం ఎప్పుడో..?

పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు

నేటికీ అందని వేతనం... పట్టించుకోని విద్యాశాఖ

6

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం

డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కార్పొరేట్లకు మోదీ ఊడిగం

సీపీపై రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

7

జై హనుమాన్

కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

6



వైసీపీ పాపాలు..!



అహుడా కార్యాలయం

(5వ పేజీ తరువాయి)

40వేల మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందని అహుడా వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతులు తీసుకోకుండా వేసిన లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. డెవలప్‌మెంట్ చార్జీలు, ఫీజులు చెల్లించకుండా అక్రమంగా లేఅవుట్లు వేసేశారు. కొందరు అధికారులు.. వైసీపీ నేతలతో కుమ్మక్కై యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అహుడాలో పనిచేసే ఓ ఇంజనీరు.. వైసీపీ నాయకులతో బహిరంగంగానే చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారనే చర్చ సాగుతోంది. గతంలో ఆ ఇంజనీరు అనంత నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేసిన సమయంలోనే భారీగా అక్రమార్జనకు మరిగారనే పేరు మూటగట్టుకున్నారు. తననెవరూ ఏమీ చేసుకోలేరనే ధీమాతోనే అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఆ ఇంజనీరు పనిచేస్తుండడం గమనార్హం.

నగర శివారులోనే అధికం

అనంతపురం నగర శివారులోనే అత్యధికంగా అనధికార లేఅవుట్లు వెలిశాయి. గోవిందంపల్లిలో సర్వే నంబర్లు 78, 145, 165, వడియంపేట గ్రామ పంచాయతీ పొడరాళ్ల పరిధి సర్వే నంబర్ల 295, 279, 84, 85, 87లో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో రాళ్లను ఇటీవల అహుడా అధికారులు తొలగించారు. నారాయణపురం పంచాయతీలోని సర్వే నంబరు 104, 202లో (10.8 ఎకరాలు), సర్వే నంబరు 142,145లలో (2.8 ఎకరాలు). నరసనాయుని కుంట పంచాయతీలో సర్వే నంబరు 111, 117లలో (6.5 ఎకరాలు), సర్వే నంబరు 113లో ఎకరం, సర్వే నంబరు 121లో (6.4 ఎకరాలు), సర్వే నంబరు 124, 126లలో (4.6ఎకరాలు), కక్కలపల్లి పంచాయతీలో సర్వే నంబరు 191లో (8ఎకరాలు), సర్వే నంబరు 183లో (2.1ఎకరాలు), సోములదొడ్డి పంచాయతీలో సర్వే నంబరు 62లో (11.5) ఎకరాల్లో వేసిన అనధికార లేఅవుట్లలోని రాళ్లను ఆయా పంచాయతీ కార్యదర్శులతో కలిసి అహుడా ప్లానింగ్ అధికారులు తొలగించారు.

అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే

-టీసీ వరుణ్, అహుడా చైర్మన్



అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లు అన్నింటినీ క్రమబద్ధీకరించుకోవాల్సిందే. లేదంటే బ్లాక్‌లిస్టులో పెట్టేస్తాం. అహుడా పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న అనధికారి లేఅవుట్ల వివరాలను సేకరించి, ఎల్ఆర్ఎస్ వర్తింపజేసేలా ప్రణాళికలు రూపొందించాం.

చిన్నారుల వృక్షా బంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థులు

కుందుర్పి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న విలువల బడుల్లో వృక్షా బంధన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ రోజున విద్యార్థులందరూ తాము నాటిన చెట్లకు రాఖీలు కడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విలువల బడుల ఉపాధ్యాయులు నాగరాజు, దిలీప్, అనిత, మల్లికార్జున, ఆశాలక్ష్మి, శ్రీలత, రఘువరన్, హనుమంతరాయుడు, కోఆర్డినేటర్ శ్రీకాంత్ విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. రక్షాబంధన్ రోజున మానవ సంబంధాలను, విలువలను తెలియజేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్‌కే లెనిన్ బాబు అభినందించారు.

దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ

ఎంఎస్ రాజుకు రాఖీ కట్టిన పల్లె సింధూర



ఎంఎస్ రాజుకు రాఖీ కడుతున్న సింధూరారెడ్డి

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి రాఖీ కట్టారు. నగరంలోని ఎంఎస్ రాజు నివాసానికి శనివారం సింధూరా రెడ్డి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం ఆ మెకు రాజు దంపతులు చీర, సారె పెట్టి గౌరవించారు. దేవుడిచ్చిన అన్నయ్యకు రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందని పల్లె సింధూర పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి రూ. 6.47లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన చెక్కులను నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈ 14 నెలల్లోనే సుమారు రూ 1.75 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి సాయం ఎవరికీ అందలేదన్నారు. జగన్ పాలనంతా ప్రజావ్యతిరేకంగానే సాగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్యచౌదరి, కోనంకి గంగారామ్, అహ్మద్, కడియాల కొండన్న, చేపల హరి, గోపాల్ గౌడ్, నెట్టెం బాలకృష్ణ, సుధాకర్ యాదవ్, లక్ష్మీ నరసింహ, దుర్గేష్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

వేతనం ఎప్పుడో..?

పది మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలు

నేటికీ అందని వేతనం... పట్టించుకోని విద్యాశాఖ



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల మూల్యాంకన వేతనాలు విద్యాశాఖ ఎప్పుడు ఇస్తుందోనని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మూల్యాంకనం ముగిసి నాలుగు నెలలైనా ఇంతవరకు చెల్లింపుల్లేవు. దూరప్రాంతాల నుంచి సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చిన ఉపాధ్యాయులు మూల్యాంకన వేతనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున 6 వేల వరకు, సహాయకులకు 3 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 1,500 మంది టీచర్లకు రూ.72.8 లక్షలు, 200 మంది సహాయకులకు రూ.13.09 లక్షలు మూల్యాంకన నిధులు విడుదల కావాల్సి ఉందని విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేతన చెల్లింపుల కోసం ఉన్నత, జిల్లాస్థాయిలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజు రూపంలో వసూలు చేసినా..

మూల్యాంకన చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారు. ఇలా వసూలు చేసిన సొమ్మును ప్రశ్నాపత్రాల ముద్రణ, కేంద్రాల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రవాణా, ఇన్విజిలేటర్ల భత్యం, మూల్యాంకన వేతన చెల్లింపుల కోసం వినియోగించాలి. కావున, పరీక్షల ప్రక్రియకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. విద్యార్థులు జాప్యం చేస్తే జరిమానాలు వేస్తున్నారు. ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు చేస్తుందో అర్థం కావడంలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

ఏటా ఇదే తంతు

పదో తరగతి మూల్యాంకన చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది పది సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన వేతనం నేటికీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దాదాపు పది రోజులపాటు ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. ఇతరప్రాంతాల నంచి వచ్చిన వారికి డీఏ కూడా చెల్లించాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వెంటనే చెల్లించాలి



మూల్యాంకన వేతనాలు అధికారులు వెంటనే చెల్లించాలి. జిల్లాలో చాలామంది టీచర్లు సొంత ఖర్చులు పెట్టుకుని మూల్యాంకనానికి హాజరయ్యారు. మామూలుగా మూల్యాంకనం జరిగిన వెంటనే ఇవ్వాలి. అసలు మూల్యాంకనం రుసుం ప్రభుత్వం నుంచి విడుదలైంది. జిల్లా విద్యాశాఖ అధికారులే ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలాగైతే భవిష్యత్తులో మూల్యాంకన విధులు అంటనే ఉపాధ్యాయులు వెనకడుగు వేస్తారని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి.

-సానె రవీంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరగా ఇవ్వాలి

- సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి, యూటీఎఫ్



ప్రభుత్వం మూల్యాంకన వేతనాన్ని త్వరగా చెల్లించాలి. మూల్యాంకనం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనం చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటి? విద్యాశాఖ అధికారులు కూడా ఉపాధ్యాయులతో పని చేయించుకుని వారికి వేతనం ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారు.

మూడు రోజుల్లో జమవుతుంది

-కిష్టప్ప, డీఈఓ

పదో తరగతి మూల్యాంకనం చేసిన టీచర్లకు వేతనం మూడు రోజుల్లో వారి ఖాతాల్లోకి జమవుతుంది. బడ్జెట్ వచ్చింది. వేతనాల బిల్లులు ట్రెజరీకి పంపాం. మూడు రోజుల్లో వేతనం జమవుతుంది.



కసాపురంలో స్వామికి అలంకరణ



నేమకల్లులో..



మురడిలో...



నేమకల్లులో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జై హనుమాన్

అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

కసాపురం, మురడి, నేమకల్లు ఆలయాలు కిటకిట

గుంతకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి, శనివారం కావడంతో జిల్లాలోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివార్లకు గజ వాహనోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్టుకు వేకువనే అభిషేకాలు చేశారు. వజ్రఖచిత స్వర్ణాభరణ అలంకారాలు చేశారు. సెలవు దినం కూడా కావడంతో ఉదయం నుంచీ రాత్రి 9 గంటల వరకూ ఇసుకేస్తే రాలనంత మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. దీంతో పట్టణంలో పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. క్యూలైన్లను నియంత్రించడానికి పోలీసులు, ఆలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ఆపసోపాలు పడాల్సి వచ్చింది. ఆలయంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం గజ వాహనంపై శ్రీ సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

నేమకల్లు కిటకిట..

బొమ్మనహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తజనసంద్రంగా మారింది. సర్వదర్శనానికి 2 గంటలుపైగా పట్టింది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి రూరల్ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, కంప్లి మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు.. స్వామివారిని దర్శించుకున్నారు.

మార్మోగిన అంజన్న నామం

డీ హీరేహాళ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామం అంజన్న నామస్మరణతో మార్మోగింది. గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటకలోని కురుగోడు మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణ రెడ్డి పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలను ఉప లోకాయుక్త రజని సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు అందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్ రోడ్డు, రామ్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాలతో పాటు శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో వేదపండితులు వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు.

పుస్తకావిష్కరణ సభకు తరలిరండి

అనంతపురం టౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో పుస్తకావిష్కరణ సభ జరగనుందని, విజయవంతం చేయాలని జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. అందులో సీనియర్ కవి గుడిపాటి సూర్యం రచించిన 'జీవన శిల్పి' కవితా సంపుటిని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొనాలని కోరారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నామనీ, ఉమ్మడి జిల్లాలోని టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మెరుగైన బోధన, విద్యార్థుల అభ్యున్నతికి కృషి, క్రమశిక్షణ కలిగిన టీచర్లు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల టీచర్లు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని జయచంద్రారెడ్డి కోరారు. వివరాలకు 9030944717 నంబరులో సంప్రదించాలన్నారు.

బీఏఎస్‌ను పునరుద్ధరించాలి

- ఎమ్మార్పీఎస్

అనంతపురం వైద్యం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చదివించేలా బెస్ట్ అవలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019కి ముందు సీఎంగా ఉన్న చంద్రబాబు బీఏఎస్‌ను తీసుకొచ్చారన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆ పథకాన్ని తొలగించారన్నారు. దీంతో వందలాది మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు గత ఐదేళ్లలో కార్పొరేట్ పాఠశాలలకు దూరమయ్యారని వాపోయారు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో బీఏఎస్‌పై వారి తల్లిదండ్రుల్లో ఆశలు పెరిగాయన్నారు. అయితే ఏడాది గడిచినా బీఏఎస్‌పై ప్రభుత్వం మాట్లాడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి బీఏఎస్‌ను పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు అంజినప్ప, ఉదయ్‌కుమార్, రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సున్నం వేశాడు..!

సున్నా డౌన్ పేమెంట్, సున్నా వడ్డీతో కార్లు ఇప్పిస్తానంటూ మోసం

డ్రైవర్లకు రూ.3 లక్షలకు కుచ్చుటోపీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గార్లదిన్నె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీరో డౌన్ పేమెంట్... జీరో ఇంట్రెస్ట్‌తో కొత్త కార్లు ఇప్పిస్తానని నమ్మబలికి డ్రైవర్లకు కుచ్చుటోపీ పెట్టాడు ఓ మోసగాడు. జాతీయ రహదారి పనులు చేసే సంస్థలో అద్దెకు పెట్టిస్తానంటూ డబ్బు వసూలు చేసి, ఉడాయించాడు. గార్లదిన్నెలో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గార్లదిన్నె, శింగనమల మండలాలకు చెందిన రమేష్, దేవరాజు, నాగరాజు, వెంకటేష్, తిమ్మయ్య కారు డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు. వారికి గార్లదిన్నెలో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమె ఎన్‌హెచ్ఏఐలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నానని చెప్పింది. సాయి అనే వ్యక్తి తనతోపాటు ఉద్యోగం చేస్తున్నాడని అతడిని డ్రైవర్లకు పరిచయం చేసింది. తనది రాజమండ్రి అనీ, తాను ఎన్‌హెచ్ఏఐలో ఉద్యోగం చేస్తున్నానని అతడు చెప్పాడు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఎన్‌హెచ్ పనులు చేపడుతున్నారనీ, అందులో చాలామంది ఉద్యోగులున్నారన్నారు. కార్యాలయం మాత్రం అనంతపురంలో ఉందన్నాడు. ఉద్యోగులు రోజూ అనంతపురం నుంచి ధర్మవరానికి రాకపోకలు సాగిస్తున్నారని నమ్మబలికారు. అందుకు కార్లు అద్దెకు కావాలని తెలిపారు. ఎన్‌హెచ్ పనులు ఐదేళ్లు ఉంటాయనీ, జీరో డౌన్‌పేమెంట్‌తో కార్లు ఇప్పిస్తానని డ్రైవర్లకు ఆశ చూపాడు. డీజిల్ అంతా కంపెనీనే భరిస్తూ కారుకు నెలకు రూ.40వేలు, డ్రైవర్‌కు రూ.17వేలు మొత్తం రూ.57వేలు ఇప్పిస్తానన్నాడు. కార్లకు బాడుగలు లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిన తరుణంలో డౌన్ పేమెంట్, వడ్డీ లేకుండా కొత్తకార్లు వస్తాయని చెప్పడంతో డ్రైవర్లు నమ్మారు. 5 సంవత్సరాలు అగ్రిమెంట్ చేయాల్సి ఉంటుందని సాయి నమ్మబలికాడు. అందుకు డ్రైవర్లు ఓకే చెప్పారు. అగ్రిమెంట్‌కు ఒక్కొక్కరు రూ.10వేలు... కారు బుకింగ్ కోసం రూ.50వేలు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇందుకు డ్రైవర్లు ఒక్కక్కరు రూ.10వేలు ఫోన్ పే చేసి, రూ. 50వేలు నగదు రూపంలో సాయికి అందజేశారు. ఇలా ఐదుగురు మొత్తం రూ.3 లక్షలు ముట్టజెప్పారు. మూడు నెలలు కావస్తున్నా కొత్తకార్లు రాలేదు. డ్రైవర్లకు అనుమానం వచ్చి సాయికి ఫోన్ చేశారు. అదిగో...ఇదిగో.. అంటూ కాలయాపన చేయసాగాడు. 'నాతో డబ్బు ల్లేవు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బెదిరించాడు. దీంతో సాయిని పరిచయం చేసిన మహిళను డ్రైవర్లు నిలదీశారు. తనకు సంబంధం లేదని మహిళ చెప్పింది. ఆమెతో కారు డ్రైవర్లు వాదనకు దిగారు. తాను కూడా కార్ల కోసం డబ్బు కట్టి, మోసపోయనని మహిళ వాపోయింది. దీంతో కారు డ్రైవర్లు, మహిళ.. పోలీసులను ఆశ్రయించారు. సాయి అనే వ్యక్తి తమకు కార్ల ఆశ చూపి మోసం చేశాడనీ, న్యాయం చేయాలని కోరారు. విచారణ చేసి న్యాయం చేస్తామని గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

దండించాడని... దాడి

బాధితుడి మృతి.. 24 గంటల్లో నిందితుడి అరెస్టు



నిందితుడితో త్రీటౌన్ పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నా, పెద్దా లేదా అంటూ గుర్తు తెలియని వ్యక్తి దండించాడన్న కోపంతో పిడిగుద్దులు గుద్దడంతో అతడు స్పృహతప్పి పడి మరణించాడు. దాడి చేసి పారిపోయిన నిందితుడిని త్రీటౌన్ పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. శనివారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలప్పుడు శ్రీనివాసనగర్‌లోని అన్న క్యాంటీన్ వద్ద ఘర్షణ జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మంగళమడక గ్రామానికి చెందిన చిన్న వెంకటరాముడు(50) స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. శ్రీనివాసనగర్‌లోని రాముని గుడి వద్ద నివాసం ఉండేవాడు. ఆయన అన్న క్యాంటీన్ వద్ద ఉండగా, వినాయకనగర్‌కు చెందిన బర్గోళ్ల రామంజి అలియాస్ రామాంజనేయులు(33) అక్కడికి వచ్చాడు. నిలబడిన ఉన్న చిన్న వెంకటరాముడిని మాట్లాడిస్తూ... 'మావాళ్లు ఏమైనా ఇక్కడ వచ్చినారా ఓయ్...!' అన్నాడు. దీంతో వయసురీత్యా పెద్ద అయిన చిన్న వెంకటరాముడు 'నువ్వు ఎవరు నన్ను అడుగుతావు... చిన్న, పెద్ద తేడా లేదా..?' అంటూ దండించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. కోపం మీద ఉన్న రామాంజనేయులు ఒక్కసారిగా వెంకటరాముడు మొహం, ఛాతీపై మూడు, నాలుగుసార్లు పిడిగుద్దులు గుద్దాడు. దీంతో చిన్న వెంకటరాముడు స్పృహతప్పి పడి, మరణించాడు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంతో నిందితుడిని రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

విస్తారంగా వర్షాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా వజ్రకరూరులో 86.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 70.4, శెట్టూరు 68.4, బెళుగుప్ప 65.4, విడపనకల్లు, తాడిపత్రి 61.4, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం 58.2, పెద్దవడుగూరు 52.4, యల్లనూరు 49.8, యాడికి 48.4, గార్లదిన్నె 46.4, కంబదూరు 45.4, ఉరవకొండ 45.2, రాయదుర్గం 43.2, కుందుర్పి 39.6, కళ్యాణదుర్గం 39.0, అనంతపురం 32.4, గుంతకల్లు 30.2, శింగనమల 28.4, పామిడి 25.2, కణేకల్లు, రాప్తాడు 21.0, డి.హిరేహాళ్, బుక్కరాయసముద్రం 20.2, పుట్లూరు 19.4, కూడేరు 18.4, నార్పల 16.6, పెద్దపప్పూరు 9.6, బొమ్మనహాళ్ 4.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

'బీసీలకు 49శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉపాధి, చట్టసభల్లో 49శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జేఏసీ కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5శాతం ఉన్న అగ్రవర్ణాలే ఆధిపత్యం చలాయిస్తుంటే... 56ఉన్న బీసీలు బానిసలుగా బతకాల్సివస్తోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి బీసీలకు 27శాతం రిజర్వేషన్లు వస్తున్నాయని, పాలకులు మారినా బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్, తెలంగాణ రాష్ట్రాల తరహాలో ఏపీలో కూడా జనాభాకు అనుగుణంగా బీసీలకు 49శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, నరేష్, అభిరామ్, పార్థు, గోవర్ధన్, ప్రేమానంద్ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌కు ఏకలవ్యుడి పేరు పెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో టవర్‌క్లాక్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్‌కు ఏకలవ్యగా నామకరణం చేయాలని ఏకలవ్య ట్రైబల్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకట రామయ్య కోరారు. ఈ మేరకు శనివారం డీఆర్ఓ మలోలాను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పలు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు బ్రహ్మయ్య, చంద్రప్ప, చిన్నలింగన్న, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో అండర్‌డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షం వచ్చినా లోతట్టు ప్రాంతాలు వరదల్లో చిక్కుకుని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రధాన రహదారుల్లో సైతం వర్షం నీరు నిలబడి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆక్రమణకు గురైన మురుగుకాలువలను క్రమబద్ధీకరించి వెడల్పు చేయాలని విన్నవించారు.

'కొత్తచెరువు చరిత్ర' అమోఘం

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు చరిత్రను భావితరాలకు అందించేందుకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంగన్న కృషి అమోఘమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. వెంగన్న రచించిన కొత్తచెరువు సమగ్ర చరిత్ర పుస్తకావిష్కరణ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ.. కొత్తచెరువు గ్రామ పుట్టుక, అభివృద్ధికి సంబంధించిన వెయ్యేళ్ల చరిత్రను పుస్తకంగా భావితరాలకు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ పుస్తకంలో బుక్కపట్నం చెరువు నిర్మాణ చరిత్ర, విజయనగర రాజుల సేవలు, విద్య, వైద్యం, వ్యవసాయ అభివృద్ధి గురించి రచయిత సమగ్రంగా వివరించారన్నారు. గ్రామంలో పలు వంశాల చరిత్రను కూడా ఈ పుస్తకం ద్వారా తెలియజేశారన్నారు. దాదాపు 15 సంవత్సరాలు పరిశోధన చేసి 2021 నుంచి ఈ పుస్తకం వెంగన్న రాశారన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

ముంచిన వాన

- ధర్మవరంలో భారీ వర్షం
- మగ్గం గుంతల్లోకి చేరిన వర్షపు నీరు
- తెల్లవార్లు జాగరణ చేసిన నేతన్నలు
- భృతి ఇవ్వాలంటున్న చేనేత కార్మికులు

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మగ్గం గుంతల్లోకి నీరింది. దీంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని వైఎస్ఆర్, ఇందిరమ్మ, కేతిరెడ్డి కాలనీలలో 30 మగ్గాల ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో మగ్గాల గుంతలన్నీ నిండటంతోపాటు నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిసిపోయాయి. చేనేత కార్మికులు మగ్గం గుంతల్లో, ఇళ్లలోకి చేరిన నీటిని తెల్లవార్లు తోడేశారు. చేనేత కార్మికులు మాట్లాడుతూ.. డ్రైనేజీలు నిర్మించకపోవడం, ఇంటి ఎదుట రోడ్లు ఎత్తుగా ఉండటంతో వాన నీరంతా ఇళ్లకి వచ్చినట్లు తెలిపారు. తెల్లవార్లు ఈ నీటిని ఎత్తిపోస్తూ జాగారం చేసినట్లు పలువురు బాధితులు తెలిపారు. మగ్గాలన్నీ తడిసిపోవడంతో నెలరోజులపాటు ఉపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ హయాంలో వర్షాకాలంలో వర్షాకాలపు భృతి ఇచ్చారని, ఆ దిశగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మూడునెలలపాటు వర్షాకాలపు భృతి ఇవ్వాలని కోరారు.



ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీలో ఇళ్లలోకి చేరిన వాననీరు



ధర్మవరంలో ఓ ఇంటి ముందు నిలిచిన వాన నీరు

పరిశీలించిన కమిషనర్, టీడీపీ నాయకులు

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, టీడీపీ నాయకులు శనివారం పరిశీలించారు. తడిసిపోయిన మగ్గం గుంతలు, ఆహారధాన్యాలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్, నాయకులు బొట్టు కిష్ట పాల్గొన్నారు.

పొంగిన వాగులు, వంకలు

ధర్మవరంరూరల్: ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురవడంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. ధర్మవరంలో 52..06మిమీ వర్షపాత నమోదైనట్లు ఏఎస్ఓ శర్మ తెలిపారు. మండలంలోని గొట్లూరు గ్రామంలో ఇళ్ల మధ్యన భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పదేళ్లుగా వర్షం వచ్చినపుడల్లా ఇబ్బంది పడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉపాధి కోల్పోయాం



భారీ వర్షానికి మగ్గాలన్నీ తడిసిపోయాయి. ఇళ్లలోకి, మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని తోడేసేందుకు శుక్రవారం తెల్లవార్లు జాగరణ చేశాం. ఇంటిలోని నిత్యావసర సరుకులు, వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో చాలా ఇబ్బందులుపడ్డాం. కాలనీలో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు వచ్చి ఇళ్లలోకి చేరింది. కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడమే ఇందుకు కారణం.

-సరస్వతి, చేనేత కార్మికురాలు, ఇందిరమ్మ కాలనీ

వర్షాకాలపు భృతి ఇవ్వాలి



ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. వర్షాలు ఎక్కువగా వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరి మగ్గాలన్నీ పూర్తిగా తడిసిపోతాయి. అవి ఆరడానికే నెలరోజులు పడుతుంది. దీంతో ఉపాధి కోల్పోతాం. గతంలో టీడీపీ ప్రభుత్వం మూడునెలల పాటు బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేసేది. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలి.

-కిష్టప్ప, చేనేత కార్మికుడు, ఇందిరమ్మ కాలనీ



ఇందిరమ్మ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, టీడీపీ నాయకులు

క్రైం కార్నర్

వివాహేతర బంధానికి అడ్డమనే హత్య !

భార్య సహా ఐదుగురి అరెస్ట్



నిందితులను చూపుతున్న లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది

లేపాక్షి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సడ్లపల్లి పంచాయతీ తిలక్‌నగర్‌లో ఈనెల 2న వెలుగు చూసిన హత్యకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని షేక్ దాదాపీర్‌ను(28) ఆయన భార్య ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అరెస్టు వివరాలను విలేకరులకు శనివారం వివరించారు. పరిగి గ్రామానికి చెందిన దిల్షాద్ 11 ఏళ్ల కిందటే భర్తను వదిలేసి ఒంటరిగా ఉండేది. ఆమెకు హిందూపురం త్యాగరాజ్‌నగర్‌కు చెందిన షేక్ దాదాపీర్‌తో రెండో పెళ్లి జరిగింది. షేక్ దాదాపీర్(28) వెల్డింగ్ పనులు చేసుకుంటూ చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ స్నేహితులతో జులాయిగా తిరిగేవాడు. అప్పుడప్పుడు తన స్నేహితులను ఇంటికి తీసుకొచ్చేవాడు. ఈక్రమంలోనే తన భర్త స్నేహితుల్లో ఒకడైన పవన్‌తో దిల్షాద్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న దాదాపీర్ తన భార్య, పవన్‌కుమార్‌ను హెచ్చరించాడు. దీంతో వారిద్దరూ దాదాపీర్ అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో పవన్ తన స్నేహితులు నరసింహులు, బుడేన్‌సాబ్ ఇనాయతుల్లా, బాబాఅఫ్రీదిలతో కలిసి దాదాపీర్‌ను మద్యం తాగేందుకు ఆటోనగర్‌లోని ఓ పాడుబడ్డ ఇంట్లోకి తీసుకెళ్లారు. అక్కడ మద్యం సేవించి పదునైనా ఆయుధంతో హత్యచేసి పరారయ్యారు. కొంతమంది అందించిన సమాచారంతో మృతుడు దాదాపీర్ తల్లి షేక్ రహ్మతున్నీసా ఘటనస్థలానికి వెళ్లి కుమారుడిని గుర్తుపట్టి లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో శనివారం మలిరెడ్డిపల్లి దర్గావద్ద ఉన్న దిల్షాద్ సహాఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

పెనుకొండ రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైష్ణవి అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్ కుమార్తె వైష్ణవి ఇంటర్ పూర్తి చేసింది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి కంప్యూటర్ క్లాస్‌కు వెళ్తున్నాని చెప్పి బయటకు వెళ్లింది. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెదికారు. ఆచూకీ దొరక్కపోవడంతో పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో అమ్మాయి తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫిబ్రవరిలో మృతి.. ఇప్పుడు పోస్టుమార్టం

గుత్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆరు నెలల కిందట కోట వీధిలోని ఓ బావిలో పడి మరణించిన విద్యార్థి మృతదేహానికి పోలీసులు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. కోటవీధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాఘవవీరాచారి గత ఫిబ్రవరిలో కోట సమీపంలో ఉన్న ఓ బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. అప్పట్లో ఎటువంటి పోలీసు కేసు లేకుండానే బాలుడికి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడి సోదరి త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును తిరిగి ప్రారంభించారు. తన తమ్ముడు ప్రమాదవశాత్తు మృతి చెందలేదని హత్య చేసి ఉండవచ్చునని జిల్లా ఎస్పీకి ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం జిల్లా ఫోరెన్సిక్ నిపుణులు స్థానిక శ్మశాన వాటికలో విద్యార్థి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముస్తాబవుతున్న గణపయ్యలు

- తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు
- అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటున్న భక్తులు

కదిరి అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు సమీపిస్తుండడంతో పూజలు అందుకోవడానికి గణనాథులు సిద్ధమవుతున్నారు. పట్టణంలోని అనంతపురం, మదనపల్లి రోడ్లతోపాటు పలుచోట్ల వినాయక విగ్రహాల తయారీ ఊపందుకుంది. వివిధ రూపాల్లో 5 అడుగుల నుంచి 20 అడుగుల ఎత్తు వరకు తయారు చేస్తున్నారు. వినాయక చవితి సమీపిస్తుండంతో తయారీదారులు వేగం పెంచారు. విగ్రహాలకు తుది మొరుగులు దిద్దుతున్నారు.

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి

ఉత్సవ కమిటీ సభ్యులు తాము నెలకొల్పే విగ్రహం ఆకర్షణీయంగా ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో విగ్రహం ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కొంతమంది నిర్వాహకులు.. విగ్రహానికి ఎలాంటి రంగులు వేస్తే ఆకర్షణీయంగా ఉంటాయో తెలుసుకునేందుకు టెక్నాలజీని వాడుతున్నారు. ముందుగా కంప్యూటర్‌లో గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాలు రూపొందించి, ఆ తరువాత కళాకారులకు అవే రంగులు వేయాలని సూచిస్తున్నారు. ఎత్తు, ఆకృతిని బట్టి ధరలు నిర్ణయించి బుకింగ్ చేసుకుంటున్నారు. విగ్రహాల తయారీకి రాజస్థాన్ నుంచి కళాకారులు వస్తున్నారు. కూలీలు కూడా అక్కడి నుంచే మూడు నెలలు ముందుగా వచ్చి తయారీలో నిమగ్నమయ్యారు. వినియోగదారులను ఆకట్టుకునేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటి తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పాటు పీచు, కర్ర, రంగులు వాడుతారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు వ్యాపారులు వివిధ రూపాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు.



రంగులు అద్దుతున్న మహిళ



సిద్ధమైన గణనాథులు

పెరిగిన ఖర్చులు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగుల ధరలు పెరిగాయని తయారీదారులు అంటున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ 25 కిలోల బస్తా రూ.400కి చేరుకుంది. ఈ పౌడర్ రాజస్థాన్ నుంచి వస్తుంది. కళాకారులు, కూలీల రేట్లు కూడా పెంచేశారని తయారీదారులు చెబుతున్నారు. వారికి డిమాండ్ అధికంగా ఉండడంతో కూలీ రేట్లు విపరీతంగా పెంచేశారనీ, ఇవన్నీ భారమని అంటున్నారు.

రంగుల విగ్రహాలపైనే ఆసక్తి: యశ్వంత్, వ్యాపారి



రంగుల వినాయక విగ్రహాలను కొలువు దీర్చేందుకే ఇష్టపడతారు. దీంతో రంగుల విగ్రహాలనే తయారు చేస్తున్నాం. చవితి పండగకు రెండు వారాలే సమయం ఉండడంతో విగ్రహాల తయారీ వేగం పెంచాం. గతంలో కంటే ఈసారి వ్యాపారం బాగా ఉంటుందని ఆశిస్తున్నాం.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ శనివారం తెలిపారు. కనిష్ఠ ధర రూ.24, సరాసరి రూ.32 పలికాయన్నారు. మార్కెట్‌కు 3,225 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు శనివారం తెలిపారు. కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 785 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

జీడిపల్లికి 2,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు శనివారం తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1.811 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. ఔట్‌ఫ్లో 2,321 క్యూసెక్కులు ఉందన్నారు.

కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం ఊడిగం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పట్టణంలో సీపీఐ పట్టణ 14వ మహా సభలను శనివారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మొయిన్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆంధ్రబ్యాంక్ రోడ్డు నుంచి పాత బస్టాండ్‌లోని బహిరంగ ప్రదేశం వరకు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ పేద ప్రజల కోసం పనిచేయడం లేదని కేవలం అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థల కోసమే పని చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దేశం మొత్తం దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలని చూస్తున్నాడన్నారు. ప్రజలు బీజేపీ మాయ మాటను నమ్మవద్దన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడి బీజేపీని గద్దెదింపాలని పిలుపునిచ్చారు.

జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పరిపాలన మొత్తం పోలీసుల చేతిల్లో పెట్టి, బటన్లు నొక్కడం పనిగా పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. అందుకే ప్రజలు రెండు బటన్లు నొక్కి గద్దె దింపారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇతర దేశాలకు వెళ్లి అప్పులు తెచ్చి రాష్ట్ర ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల కోసం పోరాడుతున్నది ఒకే ఒక్క పార్టీ అది కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, కౌన్సిల్ సభ్యులు మురళీకృష్ణ, జాన్సన్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ గోవిందు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

జీతం రావాలంటే సమ్మె చేయాల్సిందే

- సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

తాడిమర్రి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జీతం రావాలంటే సమ్మె చేయాల్సిందేనా అని సత్యసాయి తాగునీటికార్మికులు వాపోతున్నారు. ఈ తాగునీటి పథకంలో జిల్లాలో 550 మంది స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, కొత్తచెరువు, పుట్టపర్తి, ధర్మవరం ప్రాంతాలకు సక్రమంగా తాగునీటి సరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరిస్తారు. ఎక్కడ పైప్‌లైన్ పగిలినా రిపేరీ వీరి బాధ్యతే. వీరు పని చేయకపోతే ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరా బంద్ అవుతుంది. ఇంతటి కీలకంగా పని చేస్తున్న వీరికి ప్రతి నెలా జీతం మాత్రం సక్రమంగా అందడం లేదు. ఎప్పటికప్పుడు ధర్నాలు, నిరసనలు తెలిపితే తప్పా వేతనం అందని పరిస్థితి. గతనెల నుంచి వేతనం ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకునే వారులేరు. దీంతో జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యే సమయానికి ఏడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండేవి. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ఏడునెలల వేతనాలు ఇవ్వడంతో పాటుగా ఆ తరువాత ఏడు నెలలపాటు బాగానే వచ్చాయి. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి నెలకొంది.



తాడిమర్రి మెయిన్ పంప్‌హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికులతో అధికారుల చర్చలు

సత్యసాయికార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నారని సమాచారం రావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, డీఈ, కాంట్రాక్టర్‌లు కలిసి శనివారం సాయంత్రం అనంతపురంలో వారితో చర్చలు జరిపారు. ఒక నెల వేతనం మాత్రమే ఇవ్వడానికి అంగీకరించడంతో తాము సమ్మెలోకి వెళ్తామని కార్మికులు ఖరాఖండిగా తెలిపారు. దీంతో ఈనెల 16న అనంతపురం జిల్లా కలెక్టర్ తిరిగి రానున్నారని, ఆయనతో చర్చల అనంతరం నిర్ణయం తీసుకోవాలని వారు కార్మికులను కోరారు. దీనికి కార్మికులు అంగీకరించారు.

ఎదురు చూపులే...



ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనం వస్తుందని అందరు అనుకుంటారు. కానీ మాకు ఎప్పుడు వస్తుందో తెలియదు. నిరసన అయినా తెలపాలి, ధర్నా అయినా చేయాలి. లేదా నీటిసరఫరా ఆపివేయాలి. అప్పుడు మాత్రమే వేతనాలు వస్తున్నాయి. ఈనెల 1వతేదీ నుంచి నిరసన తెలుపుతున్న మా గురించి పట్టించుకునేవారు లేరు.

-మహేశ్వరరెడ్డి, సత్యసాయి స్కిల్డ్ కార్మికుడు

మరమ్మతులకు డబ్బులు ఇవ్వలేదు



అప్పోసప్పో చేసి కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నాం. పైపులైన్ మరమ్మతులకు కూడా అప్పు చేయాల్సి వస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిపినా ఏ ఒక్కరు స్పందించరు. ఎక్కడైనా రిపేర్లు వస్తే చేయమని దండిస్తారే కానీ మా గురించి పట్టించుకోరు.

-ప్రసాద్, సత్యసాయి కార్మికుడు

చీరల చోరీకి మహిళల యత్నం

యాడికి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ఒక వస్త్ర దుకాణంలో మహిళలు చోరీకి యత్నించిన విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దుస్తులు కొనడానికి ముగ్గురు మహిళలు శనివారం ఆటోలో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. దుస్తులు కొనుగోలు చేస్తున్నట్లు నటించి దుకాణ యజమానిని మాటల్లో పెట్టి మూడు చీరలను దొంగిలించినట్లు తెలిపారు. దీనిని పసిగట్టిన యజమాని ముగ్గురు మహిళలను నిలదీయడంతో తస్కరించిన చీరలను వెనక్కి ఇచ్చినట్లు తెలిపారు. స్థానికులు ఆ మహిళలను పోలీసులకు అప్పగించాలని చర్చించుకుంటుండగానే వారు వచ్చిన ఆటోలో పరారైనట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. యాడికిలో పెద్దఎత్తున పట్టుచీరల దుకాణాలు ఉండటంతో యజమానులు అప్రమత్తమయ్యారు.

బీటీపీకి పెరుగుతున్న వరద

గుమ్మఘట్ట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భైరవాన్ తిప్ప ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం పెరిగింది. కర్ణాటక ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వేదవతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తూ బీటీపీకి చేరుతోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రానికి 1646 అడుగుల మేర నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 1656 అడుగులు కాగా 2 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ప్రస్తుతం వరద నీరు పెరుగుతుండడంతో ఈ క్షణంలోనైనా ప్రాజెక్టు నిండే అస్కారం ఉంది. ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద 12వేల ఎకరాల ఆయకట్టు సాగునీరు అందుతుంది.

ఆలయంలో చోరీ

కుందుర్పి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో మారెమ్మ ఆలయంలో శనివారం దొంగతనం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఆలయం తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న రెండుతులాలు బంగారు నగలు, మూడు కిలోల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

Advertisements

జన్మదిన వేడుకలు | వివాహ శుభాకాంక్షలు

విదేశీయాన శుభాకాంక్షలు | స్వదేశాగమన శుభాకాంక్షలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు | మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి

యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,

ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.

అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767


గుంతకల్లు : 89195 18075,

హిందూపురం : 97036 18698,

లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647

AJA- 237940

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ :9030661651.

AJA- 237938

అకౌంటెంట్ కావలెను

TallyPrime Accounts, M.S ఆఫీస్ నందు అనుభవం గల అకౌంటెంట్ కావలెను. జీతం:15,000 నుంచి 20,000 కలదు. శ్రీ శబరి ఆయిల్ ట్రేడర్స్, పాతవూరు,అనంతపురం. సెల్ : 9705340666.

AJA- 237939

WANTED

మహేంద్ర జనరేటర్స్ కంపెనీ యందు సర్వీస్‌ఇంజనీర్స్ కావలెను.అర్హత: ITI, Diploma సెలెక్ట్ అయిన వారికి కంపెనీ యందు ట్రైనింగ్ ఇవ్వబడును. టెలి కాలర్స్ కావలెను.GM Engineering Corporation. Anantapuramu,Cell:9908162069

AJA- 237941

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

ఘనంగా బలరామ జయంతి


అలంకరణలో జగన్నాథుడు, సుభద్ర, బలరాముడు

ధర్మవరం రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో వెలసిన ఇస్కాన్ మందిరంలో శనివారం బలరామ జయంతిని పురస్కరించుకుని జగన్నాథ, బలరామ, సుభద్ర ప్రతిమలకు విశేషపూజలు నిర్వహించారు. భక్తులు హరేకృష్ణ హరేరామ సంకీర్తనలు చేశారు. ప్రత్యేకంగా తయారుచేసిన పలురకాల నైవేద్యాలను భగవంతుడికి సమర్పించారు. ధర్మవరం ఇస్కాన్ భజనభక్త బృందం పాల్గొన్నారు.

సర్పంచ్ ఇంట్లో చోరీ

కొత్తచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి క్రాస్ జగనన్న కాలనీలో ఆ గ్రామ సర్పంచ్ గీతాబాయి ఇంట్లో శనివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. దీనిపై సర్పంచ్ భర్త రూప్లానాయక్ ఫిర్యాదు చేశారని సీఐ మారుతీశంకర్ తెలిపారు. బండ్లపల్లి సర్పంచ్ గీతాబాయి జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల సర్పంచ్ భర్త రూ. లక్షను ఇంట్లోని చీరలకింద పెట్టాడు. అయితే శనివారం మధ్యాహ్నం సమయంలో బైక్ పై ఇద్దరు వచ్చారు. ఇందులో బురఖా ధరించిన ఒకరు పక్క ఇంటి పై నుంచి సర్పంచ్ ఇంటి వద్దకు వెళ్లారు. ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి చొరబడి చీరల్లో ఉంచిన రూ.90 వేలు, ఐదు పట్టుచీరలు ఎత్తు కెళ్లారని సర్పంచ్ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్యరూపకం



జ్ఞాపికలను అందుకున్న ధర్మవరం కళాకారులు

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన ఉత్సవాలలో భాగంగా తాము, తమ శిష్యం బృందం శనివారం మంత్రాలయంలో ప్రదర్శించిన శ్రీరాఘవేంద్ర మహత్యం నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుందని ధర్మవరం శ్రీలలిత నాట్య కళా నికేతన్ నాట్య గురువులు తెలిపారు. లలిత నాట్య కళానికేతన్ గురువులు బాబుబాలాజీ, కమలాబాలాజీ, రామలాలిత్య శిష్య బృందం పాల్గొని రాఘవేంద్ర మహత్యం అనే నృత్యరరూపకం, శ్రీకృష్ణలీలామృతం ప్రదర్శించినట్లు తెలిపారు. అనంతరం నిర్వాహకులు తమను, శిష్యబృందాన్ని సన్మానించి జ్ఞాపికలను అందజేశారని వారు తెలిపారు.

సినిమాకు క్లాప్ కొట్టిన ఎమ్మెల్యే


సినిమాకు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం 'వస్తా నీ వెనుక' సినిమాకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ క్లాప్ కొట్టారు. ఆలయంలో పూజలు చేసి సినిమాను ప్రారంభించారు. అంచి వెంకటేష్ దర్శకత్వంలో ఏజీ క్రియేషన్స్ బ్యానర్‌పై జయరామిరెడ్డి సమర్పించు ఈ చిత్రానికి నిర్మాతలుగా అంజుకుట్టి సౌజన్యారెడ్డి, బాబు ప్రసాద్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో లికితేశ్వర్‌రెడ్డి హీరోగా, మనోజ్ఞ హీరోయిన్‌గా మొదటి పరిచయం అవుతున్నట్లు తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా సందీప్ వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి చెందిన కుర్రోడు హీరోగా నటిస్తున్నట్లు పేర్కొన్నారు.

మార్కెట్‌యార్డు డైరెక్టర్‌కు సన్మానం


మార్కెట్‌యార్డు డైరెక్టర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన మండలానికి చెందిన కంచి సురేష్, మస్తానమ్మ, నిజాం, బుద్దల ప్రవీణను శనివారం టీడీపీ కార్యాలయంలో సన్మానించారు. మండలానికి చెందిన నలుగురికి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు పీట్ల సుధాకర్, కొత్త సుధాకర్‌రెడ్డి, మండోజీ ఆర్షీఖాన్, సునీల్, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజి, బీసీసెల్ నాయకులు జెరిపిటి ఆంజనప్ప, రాయల్‌కుమార్, సుభాషిణి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

తనకల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ రామానాయక్ మాట్లాడుతూ.. ఆదివాసి దినోత్సవం ప్రాముఖ్యతను తెలిపారు. ప్రిన్సిపాల్ మేరీ మార్గెట్, వైస్ ప్రిన్సిపాల్ పారేసునాయక్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సాయి ఆరామంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త పత్తి చంద్రశేఖర్ శనివారం చీరలు పంపిణీ చేశారు. అనంతరం మునిసిపల్ మహిళా కార్యకర్తలు ఆయనకు రాఖీలు కట్టి రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి రాము, కరుణాకర్, ఉమాపతి, బీడుపల్లి నాగార్జున, సీఐటీయూ నాయకులు గంగాధర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో శనివారం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలైనట్లు ముదిగుబ్బ పోలీసులు పేర్కొన్నారు. స్థానిక చెలిమి బావి వీధికి చెందిన నవీన్ ద్విచక్ర వాహనంలో గడ్డి మోపుతో ముదిగుబ్బ వైపు వెళుతున్నాడు. కదిరి నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనగా నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డును కప్పేసిన కంపచెట్లు


గొట్లూరు -బడన్నపలి రోడ్డుకు అడ్డంగా పెరిగిన కంపచెట్లు

ధర్మవరం రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు నుంచి బడన్నపల్లి కి వెళ్లే రహదారి కంపచెట్లుతో నిండిపోయింది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు విపరీతంగా పెరిగిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. పూర్తిగా కంప చెట్లు రోడ్డు మధ్యలోకి పెరిగిపోవడంతో ద్విచక్రవాహనదారులకు కంపలు గీసుకుని గాయాలవుతున్నాయని తెలుపుతున్నారు. ఆ దారిలో ప్రయాణం అంటేనే ఆందోళన కలిగిస్తోందని వాపోతున్నారు. గొట్లూరు రైతులు తమ పొలాలకుగానీ, చెరువు వద్దకుగానీ వెళ్లాలంటే ఇదే రహదారి. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామ రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న కంపచెట్లు తొలగించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు


పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న సీఐ నాగేంద్రకుమార్

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి


ధర్మవరం చెరువు వద్ద ఆంజనేయస్వామి

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరు బజారులో వెలసిన శ్రీరామభజన మందిరంలో శ్రావణ పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని తిరుమంజున సేవను ఘనంగా నిర్వహించారు. గోవింద మాలధారణ సేవా కమిటీ సభ్యులు దేవతా కృష్ణమూర్తి, కోటి వెంకటేశ్వర్లు, సుఖానంద ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలో ఊరేగించారు. అలాగే ధర్మవరంచెరువు ఏడో మరువ వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు.

● నల్లచెరువు: మండలపరిధిలో ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామికి శ్రావణమాసం మూడో శనివారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వారు అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సీఐ నాగేంద్రకుమార్ సిబ్బందితో కలిసి ఆలయం వద్ద శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఆర్డీఓ వీవీ ఎస్‌శర్మ, ఆర్టీసీ డీఎం షైనోద్దీన్ స్వామిని దర్శించుకున్నారు.

● ధర్మవరంరూరల్: మండలంలోని గొట్లూరులో వెలసిన ప్రసిద్ధ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని కొత్తపేటలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు సుదర్శనాచార్యులు, ఆయన బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరిపించారు.

ముదిగుబ్బ/నంబులపూలకుంట/నల్లమాడ: మండల పరిధిలోని దామానుపల్లి సమీపంలో మునీశ్వరుల గుట్టలో వెలసిన జగత్‌జ్యోతి ఆంజనేయస్వామికి శ్రావణ శనివారం పూజలు నిర్వహించారు. ఆకుపూజ, సింధూరార్చన తదితర ప్రత్యేక పూజలు చేసినట్లు పూజారి లక్ష్మయ్య తెలిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు. ప్రతి పౌర్ణమికి మునీశ్వరుని గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తారు. నంబులపూలకుంట మండలం లోని ధనియాన్ చెరువు, నల్లమాడ పెద్దకోట్లపల్లిలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.


కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు


ధనియాన్‌చెరువులోని ఆంజనేయ స్వామి


పెద్దకోట్లపల్లిలో

ప్రతి స్కీమ్‌లోనూ వైసీపీ స్కామ్

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బుక్కపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అమలు చేసిన ప్రతి స్కీమ్‌లోను స్కామ్ దాగి ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మండిపడ్డారు. శనివారం మండలకేంద్రంలో శనివారం సహకార సంఘం అధ్యక్షుడు చెన్నక్రిష్ణ ప్రమాణ స్వీకారోత్సవానికి, పార్టీ కార్యాలయం ప్రారంభానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ప్రతి పథకంలో అర్హుల కంటే వైసీ పీ నాయకులకే అధికంగా లబ్ధి చేరుకూరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అలాంటి పరిస్థితుల నుంచి ఒకొక్క అడుగు ముందు కేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్‌గా తయారు చేస్తామన్నారు. అనంతరం సింగల్‌విండో అధ్యక్షుడు చెన్నక్రిష్ణ, డైరెక్టర్లు గంగాధర్, జయరాముల చేత ప్రమాణ స్వీకరం చేయించారు. మండలకేంద్రంలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. టీడీపీ నాయకులు చింతా మల్లిరెడ్డి, గంగాధర్, క్రిష్టాపురం, గూనిపల్లి, పుట్టపర్తి సొసైటీ అధ్యక్షుడు అప్పస్వామి నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, కొమ్మినేని వెంకట్రాముడు, టౌన్ కన్వీనర్ ఎర్ర కేసి, జనసేన ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు సయ్యద్‌బాషా, లావణ్య, తదితరులు పాల్గొన్నా రు. అలాగే మండలంలోని సీకాయకుంటపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, రిటైర్డ్ టీచర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎమ్మెల్యే, మాజీ మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆందోళన

అమడగూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మహమ్మదాబాద్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు శనివారం రోడ్డుపై బైటాయించి ధర్నా చేపట్టారు. మహమ్మదాబాద్ పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలు మహమ్మదాబాద్‌క్రాస్, కొక్కంటి క్రాస్‌రోడ్డులోని మహమ్మదాబాద్ మూడురోడ్ల కూడలిలో రోడ్డుపై బైటాయించారు. 36 గంటలపాటు తమకు విద్యుత్ పరఫరా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మ్యాన్ సునిల్‌కు పలుమార్లు ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. దాదాపు 300మంది ధర్నాలో పాల్గొన్నారు. మూడు గంటల పాటు ధర్నా సాగడంతో రోడ్డుపై వాహనాలు రాకపోకలు రెండు కిలోమీటర్ల మేరా నిలిచిపోయాయి. అక్కడికి ఓబుళదేవర చెరువు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, అమడగూరు ట్రైనీ ఎస్ఐ ప్రదీప్‌రాజ్, ఏడీ ఓబులేసు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఆరోపణలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏడీ తెలిపారు.

దళితులపై దాడిచేసిన వారిని

వైసీపీ నుంచి బహిష్కరించాలి

● రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై దాడులకు తెగపడుతున్న వైసీపీ నాయకులను ఆ పార్టీ నుంచి బహిష్కరించి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళితులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ బేకరీ గంగాధర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం జిల్లాకేంద్రంలోని తన గృహంలో మాట్లాడుతూ... వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయ కులు దళితులపై హింస, దౌర్జన్యం అక్రమ కేసులు నడిపారని, ఇప్పుడు అధికారంలో లేకపోయినా ఆదే తీరు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే ధోరణి తిరుపతిలో మళ్ళీ పునరావృతమైందని అన్నారు. దళిత యువకుడిపై క్రూరంగా దాడిస్తున్న ఫొటోలన బాధితుడి తండ్రికి పంపి పైశాచిక అనందం పొందడం ఆపార్టీ నాయకులకే చెల్లిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి చర్యలకు తావులేదన్నారు.

అప్పు తిరిగిచ్చినా దాడి

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగిచ్చినా తమపై దాడిచేశారని పట్టణానికి చెందిన దూదేకుల దాదా ఖలందర్ శనివారం ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. దాదాఖలందర్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది మార్చిలో అవసరాల నిమిత్తం కనగానపల్లి మండలం కుర్లపల్లికి చెందిన హిదయ్‌తుల్లా నుంచి ఖలందర్ తల్లి బీబీ రూ.10వేలు అప్పుగా తీసుకుని అదే నెలలో హిదయ్‌తుల్లా తల్లి అబీదాకు తిరిగి ఇచ్చేసింది. అయితే హిదయ్‌తుల్లా వైఎస్ ఆర్ కాలనీలో ఉన్న ఖలందర్ ఇంటికి వెళ్లి అతడి తల్లి బీబీతో గొడవకు దిగాడు. ఈ విషయాన్ని బీబీ కుమారుడైన ఖలందర్‌కు ఫోన్ చేసి తెలిపింది. వెంటనే ఖలందర్ ఇంటికి వచ్చి డబ్బును అప్పుడే మీ తల్లికి ఇచ్చామని చెబుతున్నా హిదయ్‌తుల్లా వినిపించికోకుండా ఇష్టానుసారం దుర్భాషలాడుతూ ఖలందర్‌పై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన ఆయన భార్యపైనా దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన దంపతులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్సలు పొందారు. అక్కడి నుంచి నేరుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


ఈదుల వంక కల్వర్టును పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, అధికారులు

ముదిగుబ్బ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి రోడ్డులో తెగిపోయిన ఈదులవంక కల్వర్టు మరమ్మతు పనులను యుద్ధప్రతిపాదన చేపడతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు ఈ కల్వర్టు తెగిపోవడంతో... 15 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బం దులు పడుతున్న నేపథ్యంలో ఆయన పంచాయతీరాజ్ డీఈ శ్రీరాములు, తహసీల్దార్ నారాయణస్వామితో కలిసి పరిశీలించారు. వెంటనే కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని, తాను కలెక్టర్‌తో మాట్లాడుతానని శ్రీరామ్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం కల్వర్టు దెబ్బతినడం వలన 15 గ్రామాల ప్రజలు మలకవేముల క్రాస్ మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. మండల కేంద్రానికి రావాలంటే మరో పది కిలోమీటర్లు పెరుగుతందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఈ కల్వర్టు 2020లో వచ్చిన తుఫానుతో మద్దిలేరు వాగు ఉప్పొంగి నీటి ఉధృతికి పూర్తిగా కొట్టుకు పోయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేయడం వలన సమస్య వచ్చిందన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని త్వరలోనే శాశ్వత పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, కోన రవీంద్ర, వినోద్‌బాబు, గోపాల్‌రెడ్డి, సూర్యశేఖర్‌రాజు, ఆనంద్, చల్లా రమేష్, మల్లెల నారాయణ స్వామి, నంద, మీసాలరాజు, ఫిరోజ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఏడు శనివారాల వ్రతం


ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్ లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏగో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు రాజేశ్ స్వామివారిని వివిధ పూలు, పట్టువస్త్రాలు, తులసి ఆకులతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి


పరిటాల శ్రీరామ్‌కు రాఖీకడుతున్న తెలుగు మహిళలు

ధర్మవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అక్క, చెల్లెమ్మలకు సరైన ఉపాధి చూపించేందుకు తనతో పాటు ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పరిటాల శ్రీరామ్‌కు తెలుగు మహిళలు, పలు వర్గాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి రాఖీలు కట్టారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... అన్నచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించే రాఖీపండుగ వేళ ఇంత మంది మహిళల అభిమానం చూడటం ఆనందంగా ఉందన్నారు. ఉపాధిలేక ఇబ్బంది పడుతున్న మహిళల కోసం గార్మెంట్స్ తరహా పరిశ్రమలు తీసుకొచ్చేందుకు మంత్రి లోకేశ్‌తో మాట్లాడామని తెలిపారు.


లయోలా పాఠశాలలో రాఖీలను చూపుతున్న విద్యార్థులు

● ధర్మవరం రూరల్: పట్టణంలోని లయోలా పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవసలహాదారుడు అన్నం అరవింద్ విద్యార్థులకు రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగా అభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో లయోలా పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, ఉపాధ్యాయుడు చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


రిషి పాఠశాలలో రాఖీపౌర్ణమి వేడుకలు

● ధర్మవరం: పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాల ను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ్ స్వరూప్ సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ భాస్కర్‌రెడ్డి, సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో వెలసిన రమణ మహర్షి ఆశ్రమంలో శనివారం రాఖీపౌర్ణమి వేడుకలను ఆశ్రమ వ్యవస్థాపకులు చిప్పలవెంకప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లోక క్షేమం కోసం అరుణాచల మహాదీపాన్ని వెలిగించారు. అక్షరమణిమాల పారాయణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు.



చోరీలను అరికట్టేందుకు ముమ్మర గస్తీ : డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దొంగతనాలను అరికట్టేందుకు పోలీసు గస్తీ ముమ్మరం చేస్తామని, ప్రజలు తమవంతు బాధ్యతగా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల దొంగతనాలు పెచ్చుమీరడంతో వాటిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఎస్పీ ఆదేశాలతో రాత్రిపూట పోలీసు గస్తీ పెంచుతామన్నారు. ప్రజలు కూడా ఊర్లకు వెళ్లేటప్పుడు నమ్మకస్థులకు, స్థానిక పోలీసుస్టేషన్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు వాకింగ్‌కు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలన్నారు. ఇంటికి అలారం వచ్చే సీసీ కెమెరాలు అమర్చి, డీవీఆర్‌ను రహస్య ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. బస్సు రైలు ప్రయాణాల్లో అపరిచితులు ఇచ్చే తినుబండారాలను తీసుకోవద్దన్నారు. మీ ప్రయాణాల విషయాలను సోషియల్‌మీడి యాలో షేర్ చేయవద్దన్నారు. అనుమానితులపై గ్రామ/వార్డు పోలీసులకు గానీ లేదా డయల్ 100 లేదా 112 లేదా సీఐగానీ ఎస్ఐ సెల్‌ఫోన్‌కుగానీ సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలతే 1903కి ఫిర్యాదుచేయాలని, లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు.

మైనార్టీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉంది

-నాయకులు



సమావేశమైన టీడీపీ నాయకులు

హిందూపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మైనార్టీ సంక్షేమానికి కట్టుబడి ఉందని నాయకులు అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘం మైనార్టీ కమిటీల ఎంపిక కార్యక్రమానికి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మైనార్టీల సంక్షేమాభివృద్ధికి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ ముస్లిం మైనార్టీల కోసం ఎన్నో పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. కమిటీల్లో ఎంపికైనవారు పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్, ఆర్ఎంఎస్ షఫీ, డైమండ్‌బాబా, రాఘవేంద్ర, శివశంకర్, అయూబ్, అమీన్, ఖాన్, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే పీఏ

హిందూపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య పేర్కొన్నారు. శనివారం పరిగి బస్టాండు వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డును పరిశీలించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు లాభాపేక్షతో కాకుండా సేవాగుణంలో అభివృద్ధి పనులు చేయాలన్నారు. వైసీపీ హయాంలో ఒక్క రోడ్డుకూడా వేయకపోవడంతో పట్టణంలో చాలా రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాల్సి ఉందని, మొదటి విడతగా రూ.92.5కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్, సుమో శీనా, నూరుల్లా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చెత్తను రోడ్డుపై వదిలేశారు..



కాలువ నుంచి తీసిన మురుగును రోడ్డుపైనే వదిలేసిన దృశ్యం

పరిగి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 90ఇళ్ల కాలనీలో పదిరోజుల క్రితం మురుగు కాలువ నుంచి చెత్తను తీసి రోడ్డుపైనే వదిలేశారు. దీంతో సమీప ఇళ్లలోకి దుర్గంధం వస్తుండటంతోపాటు దోమలకు ఆవాసంగా ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దారులు బురదమయం



మట్టిరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అమరాపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రేవు గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్థులు అంటున్నారు. కొద్దిపాటి వర్షానికి బయటకు రావాలంటే రోడ్లు బురదమయంగా ఉంటున్నాయని పేర్కొంటున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారీ కాలువలు తీసి రోడ్డు నుంచి మరలించే ప్రయత్నం చేస్తున్నామని అంటున్నారు. కర్ణాటక ప్రాంతానికి దగ్గరగా గ్రామం ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని వివరిస్తున్నారు. తమ గ్రామానికి వీధిలైట్లు లేవని, మట్టిరోడ్లే తమకు గతని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధిలైట్లు, రోడ్లు వేయించి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు గోపీయాదవ్, హేమంత్‌రాజు, మహాలింగప్ప, పుట్టలింగప్ప, నారాయణప్ప, రంగనాథ్ తదితరులు కోరుతున్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మడకశిర టౌన్, ఆగసు9(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఏ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలోని బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు, కార్యక్రమంలో సీపీఐ నాయకురాలు కన్యాకుమారి, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘం నాయకులు చిట్టి, నిగమ్య, విజయ్‌భార్గవ్, చంద్రశేఖర్, గౌతమ్ పాల్గొన్నారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కళాశాల బాలుర హాస్టల్‌లో ఏఐఎస్ఏ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ 35ఏళ్లుగా విప్లవాత్మక ఎర్రజెండాతో ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పోరాటాలలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం రాకతో చిగురించిన పచ్చిక

తీరిన పశుగ్రాస సమస్య

ఆనందంలో రైతులు, గొర్రెల కాపర్లు




వర్షానికి పచ్చగా మారిన బీడు భూమి

చిలమత్తూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడు కరుణించాడు. రెండు నెలల కాలంగా చినుకురాలకపోవడంతో పచ్చిక బయళ్లు సైతం ఎండిపోయి మూగజీవాలకు పశుగ్రాస కొరత ఏర్పడింది. అయితే ఎట్టకేలకు నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఎండిన పచ్చిక బయళ్లు పచ్చగా మారుతున్నాయి. మూగజీవాలకు కొంత ఉపశమనం కలిగినట్లైంది. మే చివర్లో వర్షం కురిసింది. మళ్లీ రెండు నెలలుగా పడలేదు. దీంతో రైతులు పంటలను కూడా విత్తుకోలేకపోయారు. విత్తిన పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభమైనా రెండు నెలల కాలం వర్షం పడకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రధానంగా మూగజీవాల ఆలనాపాలన రైతులకు కష్టతరమైంది. ఈ తరుణంలో వరుణదేవుడు కరుణించాడు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. తీవ్ర పశుగ్రాస సమస్య నెలకొన్న వేళ కురుస్తున్న వర్షాలతో పచ్చిక బయళ్లు చిగురించాయి. తద్వారా పశువులకు సంబంధించి మేత సమస్య తీరినట్లైంది. వర్షాలు పడక, పశుగ్రాస సమస్యతో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. మేత కోసం వాటిని బయళ్లకు తీసుకెళ్లినా పిడికెడు మేత దొరకడం గగనమైపోయింది. ఈ తరుణంలో వరుణ దేవుడు కరుణించడంతో వాటి సమస్య తీరినట్లైంది. బీడు భూములు పచ్చదనాన్ని పరుచుకుంటున్నాయి. ఇన్నాళ్లు పశుగ్రాస సమస్యతో బాధపడుతున్న పాడి పశువులకు, మేకలు, గొర్రెలకు అవసరమైనంత మేత దొరుకుతోంది. దీంతో పాడి రైతులు, గొర్రెల కాపర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో మడకశిరలోని మిట్టబండ ఆంజనేయస్వామి



గుడిబండలో స్వామివారికి ఆకుపూజ



భక్తరహళ్లి నరసింహస్వామికి ప్రత్యేక అలంకరణ



జిల్లేడుగుంట ఆంజనేయస్వామి

ఘనంగా శ్రావణమాస పూజలు

మడకశిర టౌన్, ఆగసు9(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని వివిధ దేవాలయాల్లో పూజలు వైభవంగా జరిగాయి. పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ఆకు పూజ అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కావలి కొండపై అనేక మంది భక్తులు కాలినడకన కొండను ఎక్కి ఆంజనేయస్వామికి విశేష పూజలు తమ మొక్కులను తీర్చుకున్నారు. అభయ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి కుంకుమార్చన, అభిషేకాలు ఘనంగా చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాత సేవతోపాటు విశేష పూజల అనంతరం విశేష అలంకరణ చేశారు. శ్రావణమాసం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



గోరంట్ల మండలంలోని వానవోలు కస్తూరి రంగనాథస్వామికి ప్రత్యేక అలంకరణ




అగళిలోని రామాపురం ఆంజనేయస్వామి

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి, కొంకల్లు, ఎస్ రాయాపురం, కురుబరపల్లి, వీటిపల్లి తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం శ్రావణమాసం సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఆంజనేయస్వామి విగ్రహానికి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనేక భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మడకశిర రూరల్, (ఆంధ్రజ్యోతి) శ్రావణ మాసం పురస్కారించుకోని భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి ఆలయాలల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలు రథం పై ఉంచి ఊరేగింపు చేశారు మొక్కుబడులు ఉన్న భక్తులు జ్యోతులతో వచ్చి ఆలయాల చూట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అగళి, (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో మూడవ శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. రావుడి ఆంజనేయస్వామి, కోడిపల్లి ఆంజనేయస్వామి, హెచ్‌డి హళ్లి ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అలంకరణ చేశారు. అదేవిధంగా అగళి శనైశ్చర్యుని దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



పేట వేంకటరమణుడికి ప్రత్యేక పూజలు

హిందూపురం(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడో శనివారం పురస్కరించుకుని పట్టణంలోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు నిర్వహించగా పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయంలో పండ్లతో ప్రత్యేక అలంకరణచేశారు. సాయంత్రం స్వామివారిని భక్తులు ప్రత్యేకంగా దర్శించుకున్నారు. దండురోడ్డులో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచనపల్లివద్ద ఉన్న తిరుమల కొండస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామస్థులు జ్యోతులు తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు.

దుస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం

● రూ.7 లక్షలు నష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హిందూపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధనలక్ష్మీ రోడ్డులో ఉన్న రెడీమేడ్ దుస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. దుకాణంలో ఉన్న దుస్తులు, ఫర్నీచర్ కాలిపోయింది. ఉదయం అటుగా వెళ్లేవారు గుర్తించి దుకాణ యజమానికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే దుకాణం వద్దకు చేరుకుని అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రం అక్కడకు చేరుకుని మంటలు ఆర్పింది. అప్పటికే దుకాణంలోని దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ.7లక్షలు నష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారి ప్రభాకర్ తెలిపారు.



కాలిపోతున్న దుస్తులు

భారీ వర్షానికి కూలిన గోడ

- తప్పిన ప్రమాదం

పెనుకొండ రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కురుబ నారాయణకు చెందిన ప్రహరీ గోడ నేలకూలింది. గ్రామానికి చెందిన కురుబ నారాయణ గడ్డి వాములో ప్రహరీగోడకు ఆనుకుని పశువులను కట్టేసేవాడు. ఈ క్రమంలో వర్షం అధికంగా కురవడంతో వాటిని వేరేచోట కట్టేశాడు. అయితే ఉన్నపళంగా గోడ కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



నేలకూలిన ప్రహరీ

మానవ సంబంధాలను ఏకంచేసేదే రాఖీ

టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ బాధ్యత అనుబంధాన్ని సూచించే గొప్ప పండుగే రక్షాబంధన్ అని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. రాఖీ పండగను పురస్కరించుకుని శనివారం హిందూపురంలో నందమూరి బాలకృష్ణ కార్యాలయంలో తెలుగు మహిళలు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, వీరయ్యలకు రాఖీ కట్టారు. వారు మాట్లాడుతూ రక్షాబంధన్ పవిత్రమైన సదోరభావాన్ని బలోపేతం చేసే పండగ రాఖీ అన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రక్షాబంధన్, రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని బ్రహ్మకూమారి ఈశ్వరీయ విద్యావిద్యాలయానికి చెందిన ఉమాదేవి, బలరాం గుప్త తదితరులు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రముఖులకు, పోలీస్‌స్టేషన్, ఆసుపత్రిలో పనిచేసేవారికి రాఖీ కట్టి మిఠాయిలు అందించారు. అదేవిధంగా బ్రహ్మకూమారీలు జేసీ అభిషేక్‌కుమార్, ఆర్టీఓ సువర్ణ, సీఐ శేఖర్ తదితర పోలీసులు, అధికారులకు రాఖీలు కట్టారు.



జేసీ అభిషేక్ కుమార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి ఉమాదేవి

నేటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



రాఘవేంద్రస్వామి బృందావనం

పెనుకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో స్వామివారి 354వ ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని అర్చకులు వాదిరాజులు తెలిపారు. ఆదివారం పూర్వారాధన సందర్భంగా ఉదయం నిమ్మలసేవ, నిర్మాల విసర్జన, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పారాయణాలు, పాదపూజ, కనకమహాపూజ, అష్టోదశకం మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అనంతరం పల్లకీసేవ, స్వస్తవాచనం జరుగుతుందన్నారు. సోమవార మద్యారాధన, మంగళవారం ఉత్తరారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

పెనుకొండ కియ, లేపాక్షి జట్ల విజయం



విజయం సాధించిన పెనుకొండ కియ, లేపాక్షి జట్లు

మడకశిర టౌన్, ఆగసు9(ఆధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఎంఎస్ఆర్-జీటీఎస్ లెదర్‌బాల్ టీ20 క్రికెట్ పోటీలు శనివారం పోటాపోటీగా సాగాయి. హిందూపురం లెవెన్, హిందూపురం టాలెంట్ హంట్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన హిందూపురం లెవెన్ జట్టు 19.4 ఓవర్లలో 155 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిందూపురం టాలెంట్ హంట్ క్రికెట్ అకాడమీ జట్టు 140 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో హిందూపురం లెవన్ జట్టు 15 పరుగులతో విజయం సాధించింది. అనంతరం పెనుకొండ కియా, లేపాక్షి జట్లు పోటీపడ్డాయి. పెనుకొండ కియ జట్టు 19.4 ఓవర్లలో 177 పరుగుల చేయగా, లేపాక్షి జట్టు 12.5 ఓవర్లలో 52 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 124 పరుగులతో పెనుకొండ కియా జట్టు విజయం సాధించింది. అభిమన్యు స్పోర్ట్స్ సభ్యులు నాగేంద్ర, వేణు, కొల్లేష్ పోటీలను పర్యవేక్షించారు.

అనుబంధ కమిటీల ఎంపికపై కసరత్తు



అనుబంధ సంఘాల ఎంపికలో టీడీపీ నాయకులు

రొద్దం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ అనుబంధ కమిటీల ఎంపికకు సంబంధించి శనివారం నాయకులు కసరత్తు చేశారు. రొద్దంలోని టీడీపీ కార్యాలయంలో వివిధ గ్రామాల నాయకులు పార్టీకోసం కృషిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు కమిటీలను ఏర్పాటుచేశారు. కళాకారులు, వికలాంగులు తదితర అనుబంధ సంఘాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, వీరాంజనేయులు, నరహరి, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌రెడ్డి, టైలర్ ఆంజనేయులు, తిరుపాల్‌నాయుడు పాల్గొన్నారు.

భిక్ష స్వీకరణ



భిక్ష స్వీకరిస్తున్న బాలుడు

పెనుకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ వీధిలో శ్రావణ మాసం ప్రతి శనివారం చిన్న పిల్లలు బ్రాహ్మణ సంప్రదాయంలో దుస్తులు ధరించి ప్రతి ఇంటికి వెళ్లి భిక్ష స్వీకరించడం ఆచారంగా వస్తోంది. శనివారం చిన్న పిల్లలు సాంప్రదాయ దుస్తుల్లో భిక్ష స్వీకరించారు. శ్రావణమాసం చివరిరోజున స్వీకరించిన భిక్షను పాయసంగా వండుకుని ప్రసాదం స్వీకరించడం ఆనవాయితీ.

ఘనంగా ఉపాకర్మ



నూతన వటువులతో హోమాలు చేయిస్తున్న వేద పండితులు

పెనుకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉపాకర్మ మహోత్సవం (నూతన యజ్ఞోపవీత ధారణ) శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో కొత్తగా ఉపనయనం చేసుకున్న వటువుల చేత ప్రత్యేక హోమాలు చేయించారు. అనంతరం సామూహికంగా నూతన యజ్ఞోపవీత ధారణ చేపట్టారు.

యూరియా వచ్చిందోచ్..!

రొద్దం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలానికి ఎట్టకేలకు యూరియా వచ్చింది. రైతులు నెలరోజులుగా నానా తంటాలు పడ్డారు. ప్రభుత్వం అందుకు అనుగుణంగా సరఫరా చేయకపోవడం, ప్రైవేట్ షాపుల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేల ఎకరాల్లో కంది పత్తి, మొక్కజొన్న, వరిపంటలను సాగుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సేవాకేంద్రాలకు యూరియాను సకాలంలో సరఫరా చేయకపోవడంతో రైతులు కర్ణాటక నుంచి తెచ్చుకోవాల్సి వచ్చింది. అయితే రొద్దంలోని సింగిల్‌విండో సొసైటీ అధికారులు 600 బ్యాగుల యూరియాను శనివారం తెప్పించారు. దీంతో కొనుగోలుకు రైతులు ఎగబడ్డారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

అమరాపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే శివరం పంచాయతీ పేలుబండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చిక్కీరప్ప(24) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాయకులు గ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజ్, డీలర్ల సంఘం ఉపాధ్యక్షులు హనుమంతరాయుడు, నాయకులు రామన్న, మాజీ సర్పంచ్ ఈరన్న తదితరులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చిక్కీరప్ప (ఫైల్)